# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

## క్లుప్తంగా

### కొక్కిరాయలంకలో గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ అమల

**దెందులూరు:** సమస్యల పరిష్కారానికి సమష్టిగా చర్యలు తీసుకోనున్నట్టు కొక్కిరాయలంక గ్రామ సర్పంచ్ అమల తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాలు మేరకు గ్రామ సభ సచివాలయంలో నిర్వహించారు. గ్రామ కార్యదర్శి గ్రామసభ ఎజెండాను వివరించారు. తొలుత జాతీయ నాయకులు చిత్రపటాలకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ అమల పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



**ఏలూరు (ఆర్‌ఆర్ పేట):** శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు సుప్రభాత సేవ, నిత్యార్చనలు చేసి పంచామృత అభిషేకాలు చేశారు. అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. లలితాసహస్రనామ పారాయణలు, మణిద్వీప వర్ణన పారాయణలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీల ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### మైక్రో ఆర్టిస్టును అభినందించిన కలెక్టర్



కలెక్టర్ పేరును చెక్కపై చెక్కి అందజేస్తున్న మైక్రో ఆర్టిస్ట్ శివప్రసాద్

**ఏలూరు (టూటౌన్):** మైక్రో ఆర్టిస్ట్ దొర శివప్రసాద్‌ను కలెక్టర్ వెట్రి సెల్వి అభినందించారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్ గ్రౌండ్‌లో మెప్మా డిపార్టుమెంట్ స్టాల్స్ ఏర్పాటు సందర్భంగా వచ్చిన కలెక్టర్ వెట్రిసెల్వికి చెక్కతో చెక్కిన ఆమె పేరు, జాయింట్ కలెక్టర్‌కు బియ్యపు గింజపై ఐ లవ్ యూ ఇండియా అని రాసి ఇచ్చారు. దీంతో శివప్రసాద్‌ను వారు అభినందించారు.

### ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం

**ఏలూరు (టూటౌన్):** వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల కార్యాలయాలతో పాటు ప్రధాన కూడళ్లు, విద్యా సంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

#### సిబ్బందికి ప్రశంసలు

- ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించి, జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి నూలుమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వీరుల ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని నూర్జహాన్ అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, మొక్కలు నాటి కాలుష్యరహిత నగరంగా ఏలూరును తీర్చిదిద్దేందుకు సహకరించాలని నగర ప్రజలను కోరారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు సిబ్బందికి మేయర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, మున్సిపల్ ఎంఈ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.
- ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు జిల్లా ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో కోటదిబ్బ ఒకటో నెంబర్ సర్వీస్ రిజర్వాయర్ వద్ద జాతీయ పతాకాన్ని ముఖ్యఅతిథి ఎస్ఎంఆర్ పెదబాబు ఆవిష్కరించారు. గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మొక్కలు నాటారు. మాజీ డిప్యూటీ మేయర్ కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాసరావు, వంకదారు ప్రవీణ్, పాము శామ్యూల్, ఉత్సల సన్నీ సుజాత, నీత విజయ్ కుమార్ జైన్, యూనియన్ నాయకులు అప్పల రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.
- దొండపాడు పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలలో ముఖ్యఅతిథి ఏలూరు డిప్యూటీ తహసీల్దార్ ఏవీఆర్ ప్రియదర్శి జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని తన తల్లి జ్ఞానసుందరి జ్ఞాపకార్థం ఆరుగురు విద్యార్థులకు వినికిడి ఉపకరణాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస రెడ్డి, జిల్లా దివ్యాంగుల పునరావసకేంద్రం సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

#### సీపీఐ కార్యాలయంలో..

స్థానిక ఆర్ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో జాతీయ పతాకాన్ని బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. నేటి పాలకులు స్వాతంత్ర్య ఫలాలను కొందరికే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు దోహదపడే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కాపాడుకోవడానికి కార్మిక వర్గం సంసిద్ధం కావాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలపై స్వాతంత్ర్య స్ఫూర్తితో పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యాలయం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు.

#### పత్తేబాద సెంటర్‌లో..

దేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడమే స్వాతంత్ర్య సమరయోధులకు ఘనమైన నివాళులని అన్ని ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. స్థానిక పత్తేబాద బ్రహ్మంగారి గుడి వీధి సెంటర్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డివైఎఫ్ఐ నాయకులు కొల్లి ఈశ్వర్, దయంత్రి శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

#### త్యాగధనుల ఆశయాన్ని సాధిద్దాం

దేశ స్వయం ప్రతిపత్తితో పాటు భావితరాల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహానుభావుల ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్ కుమార్ పేర్కొన్నారు. కోట దిబ్బ ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతిగృహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ డయోసిస్ ఆధ్వర్యంలో బాలికలకు కాస్మోటిక్స్ పంపిణీ చేశారు. బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్ డయోసెస్ ఆఫ్ రాజమండ్రి సెక్రెటరీ రెవ ఫాదర్ ఆనంద్ కుమార్, ఏలూరు మిషన్ ప్రావిన్స్ రెవ ఫాదర్ యె.హెజ్కెల్, అసోసిట్ రెవ ఫాదర్ జోసెఫ్, ఏలూరు డిస్ట్రిక్ట్ లీడర్ రెవ ఫాదర్ సత్య, డీకన్ ఫాదర్స్, కార్యాలయ సిబ్బంది, విభిన్న ప్రతిభావంతుల హాస్టల్ బాలికలు పాల్గొన్నారు.

#### జెడ్పీ ప్రాంగణంలో..

**ఏలూరు(మెట్రో):** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రజాప్రతినిధులకు, విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, డిప్యూటీ సీఈఓ భీమేశ్వర్, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

#### నగరంలో సగర్వంగా ఎగిరిన జెండా

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్వాతంత్ర్య సమరంలో గ్రంథాలయాలు ఒక మౌన యోధుల్లా పనిచేశాయని జేసీ పి.ధాత్రిరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయంలో చదువుకొని ఏపీ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన 32 మంది అభ్యర్థులను జేసీ సన్మానించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, సీనియర్ అసిస్టెంట్ ఎల్ వెంకటేశ్వర రావు, కార్యాలయ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- పాతబస్టాండు వద్ద ఉన్న అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ కార్యాలయం వద్ద ఆ సంస్థ ప్రతినిధులు జండా ఎగురవేశారు. స్వాతంత్ర్య పోరాటాంలో ముస్లిం రాజుల నుంచి సామాన్య ముస్లింల వరకు దేశవ్యాప్తంగా 8 లక్షల ముస్లింలు వీర మరణం పొందారని గుర్తుచేశారు. సంస్థ అధ్యక్షుడు సిద్దిక్ అలీ పాషా (ఆరిఫ్ ), సెక్రటరీ ఎండీ అస్లాం షరీఫ్, ట్రెజరర్ ఎండీ కలిముద్దీన్ అయాజ్, మాజీ ప్రెసిడెంట్ ఎస్ఎం అక్బర్, ఈసీ మెంబర్ మహబూబ్ పాషా. మాజీ ఈసీ మెంబర్ అబ్దుల్ బారి తదితరులు పాల్గొన్నారు.
- ది ఏలూరు కోఆపరేటివ్ హౌస్ మార్ట్‌గేజ్ సొసైటీ ప్రాంగణంలో సొసైటీ అధ్యక్షుడు గురజాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పీఈఎఫ్ఏ అధ్యక్షుడు గురజాడ శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. పాకవర్గ సభ్యులు, సిబ్బంది హాజరయ్యారు.
- ఏలూరు హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో సంస్థ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు జాతీయ పతాకావిష్కరణ చేశారు. సంస్థ ప్రతినిధులు గుడిపాటి లలితా శర్మ, యిరదల ముద్దుకష్ణ, మజ్జి సూర్య కాంతారావు, వేణుగోపాల్ లునాని, కేబీ రావు, అంబికా రాజా, జవ్వాజి మోహన్ విఠల్, ఎల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. విద్యార్థులకు వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి పాల్గొన్న ప్రశంసా పత్రాలు అందజేశారు.
- స్థానిక అగ్రహారంలోని బాలల గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కారంశెట్టి రమేష్ బాబు జాతీయ జండా ఆవిష్కరించారు. మధ్యాహ్నపు పద్మనాభరావు, గోగు నరసింహరావు, వర్రె కొండలరావు, ఎల్. చాముండేశ్వర రావు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం శోభ పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న జేసీ ధాత్రి రెడ్డి



దొండపాడు పరివర్తన్ పాఠశాల చిన్నారులతో డీటీ ప్రియదర్శిని



తహసీల్దార్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ విజయకుమార్‌రాజు



ఏలూరు కార్పొరేషన్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ నూర్జహాన్



కోటదిబ్బ ఒకటో రిజర్వాయర్ వద్ద అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు దండలు వేస్తున్న నాయకులు



ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం



జాలిపూడి సచివాలయంలో జెండా ఎగురవేసిన సర్పంచ్ నవ్య



కోటదిబ్బ దివ్యాంగుల బాలికల హాస్టల్‌లో బాలికలకు కాస్మెటిక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం



అంజుమన్ హాల్ వద్ద జెండా ఎగురవేస్తున్న అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం ప్రతినిధులు



వైఎంహెచ్‌ఏ హాలులో జెండా ఎగురవేసిన హిందూ యువజన సంఘ నాయకులు



ఏఎస్ఆర్ స్టేడియం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన వాకర్స్



విద్యాశాఖ శకటానికి (మొదటి బహుమతి) ప్రశంసా పత్రం అందుకుంటున్న అధికారులు



వ్యవసాయ శాఖ శకటానికి (రెండో బహుమతి) ప్రశంసా పత్రం అందుకుంటున్న అధికారులు



గృహనిర్మాణ శాఖ శకటానికి (మూడో బహుమతి) ప్రశంసా పత్రం అందుకుంటున్న అధికారులు

### జాతీయభావం పెంపొందాలి

**ఏలూరు రూరల్ :** నేటి తరంలో జాతీయభావం, దేశభక్తి పెంపొందాలని రిటైర్డ్ హెచ్ఎం జల్లా వీరభద్రరావు అన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద ఏఎస్ఆర్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్, అధ్యక్షులు ప్రత్తిపాటి నాగవిఘ్నేష్, మహిళ అధ్యక్షురాలు తానికొండ మేరీ మాణిక్యం, విశ్వనాథం, మాధవరావు, కొమ్మా నాగరాజు, జంపా సూర్యనారాయణ, ఏసుబాబు తదితరులు అమరవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ జెండా ఎగురవేశారు. క్రీడాకారులు, వాకర్స్ పెద్ద పాల్గొన్నారు. సత్రంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ పిల్లలకు నోట్స్ బుక్స్ పంపిణీ చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి, టీడీపీ నేత రామకృష్ణ జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, ఆదినారాయణ, సుధాకర్ తదితరులు బాలబాలికలకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

- ఏఆర్‌డీజీకే నగరపాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 125 అడుగుల పొడవైన త్రివర్ణ పతాకంతో నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఉన్నమట్ల కాంతి జయకుమార్, పూర్వవిద్యార్థుల సంఘం నాయకుడు గొంతిన రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

#### ఏలూరు రూరల్ మండలంలో..

**దెందులూరు:** దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర సమరయోధులు త్యాగదనుల స్ఫూర్తి కొనసాగాలని ఏలూరు రూరల్ మండల తహశీల్దార్ జి విజయకుమార్ రాజు అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురువేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీలత జాతీయ పతకాన్ని ఎగురువేశారు. పాలగూడెం సచివాలయంలో గ్రామ సర్పంచ్ పి సునీత, ప్రత్తికోళ్ళలంక సచివాలయంలో సర్పంచ్ అమల, కోటేశ్వర దుర్గాపురం సచివాలయంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, జాలిపూడిలో గ్రామ సర్పంచ్ నవ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గ్రామ గ్రామాన సచివాలయాల్లో ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలు కుటుంబాలను త్యాగం చేసిన మహనీయులు చిరస్మరణీయమని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, సోమవరప్పాడు బీఈడీ కళాశాల కరస్పాండెంట్ వికార్ జనరల్ డాక్టర్ పి.బాల అన్నారు. దెందులూరు మండలంలో కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఆర్.శివాజీ, మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్ఎంలు జెండాలను ఎగురవేశారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 46 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 20 | చిక్కుడు కాయలు | 40 |
| వంకాయలు (కాంతులు) | 24 | బీర్లచిక్కుడు | 72 |
| వంకాయలు (తెలుపు) | 28 | చామదుంపలు | 36 |
| బెండకాయలు | 20 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 44 | కంద | 00 |
| కాకర కాయలు | 26 | బీట్‌రూట్ | 38 |
| బీరకాయలు | 00 | కీరా దోస | 40 |
| బీరకాయలు (పందిరి) | 28 | ఫ్రెంచ్‌బీన్స్ | 80 |
| క్యాబేజీ | 26 | అల్లం | 70-90 |
| క్యారెట్ | 40 | కొత్తిమీర (కట్ట) | 25 |
| దొండకాయలు | 24 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 32 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 25 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 36 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 20-26 | పుదీనా | 05 |
| అనబకాయ (1) | 20-25 | క్యాప్సికమ్ | 80 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకదదుంప | 48 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 28 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 32 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 25 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 08 |
| ఏలూరు - అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 14 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 17 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 12 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 05 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 16 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 18 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 16 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 30 |

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ కోమలి

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** యువతకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా మెంటల్ హెల్త్ అధికారి కేహెచ్ కోమలి సూచించారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలపై శుక్రవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే యువత జీవితాలు నాశనం చేసుకున్నట్లేనని తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం , విక్రయం జరిగితే ఆ వివరాలను పోలీసులకు లేదా 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని 2020 ఆగష్టు 15న ప్రారంభించగా నేటికి ఐదేళ్లు పూర్తయిందని, ఇది సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మత్తపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర రావు, సైకాలజిస్ట్ శ్రీనివాస్ రావు,సోషల్ వర్కర్ స్వామి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మా.. మన్నించు!

**జంగారెడ్డిగూడెం:** భారతదేశం స్వేచ్ఛావాయులు పీల్చుకోవడానికి మూలకారకుల్లో ప్రథముడు గాంధీజీ. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆయన విగ్రహాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఉన్న గాంధీజీ విగ్రహానికి కనీస గౌరవం లభించలేదు. పూలమాల వేసి దాఖలాలు లేవు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు దేశ నాయకులను గౌరవించుకోకపోవడం బాధాకరమని పలువురు పేర్కొంటున్నారు.



హైస్కూల్‌లోని గాంధీ విగ్రహం

### గిరిజనుడి దుర్మరణం

**బుట్టాయగూడెం:** మండలంలోని రెడ్డిగణపవరం శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు మృతి చెందాడు. స్థానికులు, మాజీ సర్పంచ్ కోర్స బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం మావృక్షవారిగూడెం నుంచి జీడిమామిడిపుల్ల లోడుతో వస్తున్న ట్రాక్టర్ రెడ్డిగణపవరం సమీపంలో బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరానికి చెందిన కలుం గంగరాజు (51)ను ఢీకొట్టింది. వ్యవసాయ పనుల నిమిత్తం రెడ్డిగణపవరం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న గంగరాజు తలవైపు పుల్లలు తలగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై దుర్గామహేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణంరాజులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ట్రాక్టర్‌ను బుట్టాయగూడెం స్టేషన్‌కు, గంగరాజు మృతదేహాన్ని పీఎం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### దుస్తుల పంపిణీ

**దెందులూరు:** పాలగూడెం గ్రామ సచివాలయంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు గ్రామ సర్పంచ్ పి.సునీత నూతన దుస్తులు, పండ్లు అందజేశారు. సంపూర్ణ పారిశుద్ధ్యానికి కార్మికులు చేస్తోన్న సేవలు మరువలేనివన్నారు.